• వినూత్న 'శ్రీలేఖ' మాసపత్రిక. ఆగష్టు 2002

# బెస్ట్ కపులూ - గిఫ్ట్ కూపనూ

ఉదయం పదిన్నర. వంటింట్లో పని చక్కబెట్టుకుని వస్తున్న విశాల ఫోను రింగయితే తీసింది.

"హలో, సత్యసుందరం గారున్నారండీ?" ఇంగ్లీషులో ఓ అమ్మాయి గొంతు నాజూగ్గా విన్పించే సర్కి ఎలర్టయిపోయింది. సుందరాన్ని...అదే తన భర్తని సత్యసుందరం అని ఎవరూ పిలవరు. కనీసం ఆయనైనా తన పేరు అలా రాసుకోరు. పి.ఎస్.సుందరం గానే అందరికీ తెల్సు. మరియీ అమ్మాయెవరో పూర్తి పేరుతో అడుగుతోందంటే ఆలోచించాల్సిందే. అందుకే ఆమె ప్రశ్నకు సమాధానమివ్వకుండానే "మీరెవరూ" అనడిగింది తెలుగులో. ఆ అమ్మాయి కూడ తెలుగు భాషలోకి మారి తను ఫలానా కంపెనీ నించి మాట్లాడుతున్నట్టు పేరు చెప్పి, "మీరు వారి బెటర్ హాఫ్ కదా" అని అడిగి రూఢి చేసుకున్నాక.,

"కంగ్రాచ్యులేషన్స్ మేడమ్. మేము మా కంపెనీ అడ్వర్టయిజ్‌మెంట్ కోసం ఎన్నిక

చేసిన కపుల్స్‌లో మీ దంపతుల్ని "బెస్ట్ కపుల్"గా ఎన్నిక చేశాం అంది. విశాలకేం అర్థం కాలేదు. ఆ అమ్మాయినే వివరాల డిగింది. తమదొక హాలిడే రిసార్ట్స్ నెలకొల్పే సంస్థ అనీ, దేశంలో తమ కంపెనీ తాలూకు రిసార్ట్స్ చాల అందమైన ప్రదేశాల్లో వున్నాయనీ వాటి గొప్పతనాన్ని చెప్పడానికి పెద్దపెద్ద పట్టణాల్లో "బెస్ట్ కపుల్స్"ని ఎన్నిక చేసి, వారికి ఉచిత హాలిడే ట్రిప్ ఏర్పాటు చేసి, వారి ద్వారా అందరికీ తెలిసేలా చెయ్యాలన్నదే తమ ఆశయమనీ చెప్పిందామె. అంతకు ముందు అటువంటి వాటి విషయమై విని ఉండకపోవడాన్ని అదేదో "వేసవి విడిది'కి సంబంధించినదిగా మాత్రం కాస్త అర్థమైంది విశాలకు.

"మీరు వారితో చెప్పండి" అంటూ తప్పించుకోడానికి ప్రయత్నించింది.

"తప్పకుండా చెబుతాం. మీరిరువురూ హోటల్ ఆకాష్‌కి రావాలి. మేం ఎన్నుకున్న వెయ్యిమందిలో మీరు మొదటి పదిమంది కపుల్స్‌లో వున్నారు. అంచేత మా రిసార్ట్స్‌లో మీరు కోరిన చోట నాల్గు రోజుల ఉచిత భోజన వసతి సౌకర్యం. మీరు వెళ్ళాలనుకున్న చోటుకు కారు సదుపాయం..." ఆమె ఏదో చెబుతోంది. విశాలకు నమ్మలేనివిగా కన్పించినా ఆనందమే అన్పించింది.

"మేం ఈ పట్టణలోని ప్రముఖ సంస్థలకీ, క్లబ్బులకీ, పారిశ్రామిక వాడలకీ మా ప్రతినిధులను పంపి వాకబు చేశాం. మా దృష్టికి వచ్చిన వారి నుండి కంప్యూటర్ ద్వారా మాక్కావల్సిన వారిని ఎన్నిక చేశాం. మేం ఎన్నిక చేసిన వారందరికీ మా కంపెనీ ప్రకటించిన ఉచిత సదుపాయాలూ, గిఫ్టుకూపన్లూ అందచేస్తాం. వారి ఆనందమే మా కంపెనీకి కావాలి. మా రిసార్ట్స్‌లో వారు ఆనందంగా గడిపి వాటి గురించి అందరికీ చెప్పడమే మాకు అపురూపమైన పబ్లిసిటీ." అంటూ వివరించిందామె.

విశాలకు యిప్పుడు కొంత అర్థమైంది. సాయంత్రం ఆరుగంటల తర్వాత సుందరం ఇంట్లో వుంటాడనీ అప్పుడు ఆయనకు ఫోన్ చేసి చెప్పమనీ చెప్పి ఫోన్ పెట్టేసింది.

వారితో అలా అన్నదేగాని సుందరం వచ్చేవరకూ ఈ సంగతి దాచడం విశాలకు కష్టమైపోయింది. మూడు గంటల ప్రాంతంలో సుందరం పనిచేసే కంపెనీకి ఫోన్ చేసి వివరాలు చెప్పి ఏమైనా సరే ఓ గంట ముందుగా ఇంటికి రమ్మంది. సుందరం మొదట ఆశ్చర్యపోయాడు. "బెస్ట్ కపులంటే ఎందులో బెస్టో! అయినా మనం ఆదర్శ దంపతులమేంటి మన మొహం! పెళ్ళయి యింకా మూడేళ్ళయినా కాలేదు. కాపురం మూడు చిచ్చులగానూ ఆరు అలకలగానూ అలరారుతుంటే" అన్నాడు. ఫోన్‌లోనే మూతి మూడు విరుపులు విరిచింది విశాల.

సుందరం ఆఫీసు నుంచి వచ్చిన పది నిముషాల్లోనే ఆ కంపెనీ అమ్మాయి నుండి ఫోనొచ్చింది. సుందరమే రిసీవర్ అందుకున్నాడు.

"కంగ్రాచ్యులేషన్స్ సార్. మేడమ్ మీకంతా చెప్పే వుంటారు." అంటూ మొదలు పెట్టి "మా రిసార్ట్స్‌లో గడపడం మీకొక అపూర్వమైన అనుభవం సార్. మిస్‌కాకండి"

అంటూ మర్నాడు డిన్నర్‌కి రావల్సిన సంగతి చెప్పి మళ్ళీ రిమైండ్ చేస్తానని ఫోన్ పెట్టేసింది.

ఇంట్లో వుండే విశాలకెంత కొత్తగా అర్థం కాకుండా వుందో, ఆఫీసుకెళ్ళీ, బయట తిరిగొచ్చే సుందరానికీ అంతే కొత్తగా వుందా సంగతి.

ఏదో పోటీ పెట్టి అందులో పాల్గొని నెగ్గినవారికి బహుమతీ, ఫ్రీ హాలిడే ట్రిప్పు ఎరేంజ్ చేస్తే బాగానే వుంటుంది. అటువంటి స్కీములు చాలా వున్నట్టు తెల్సు. కొండ చీపురుకో, కొత్తిమీర కట్టకో ఓ కూపన్ జతచేసి అది నింపిస్తే లాటరీ తీసి బహుమతులు పంచడం - పంచేమనడం ఉంది. మరి ఏ పోటీ లేకుండా దంపతుల్ని ఎన్నిక చేసి వారికి 'బెస్ట్ కపుల్' అనే ముద్రవేసి మీకు గిఫ్టుకూపన్‌లు యిస్తాం. ఫ్రీ హాలిడే ట్రిప్ ప్లాన్ చేసుకోండి. ఫ్రీగా మా అతిధ్యాన్ని స్వీకరించండి. ప్రస్తుతానికి మేమిచ్చే డిన్నరు తీసుకుని మమ్మానందింపజేయండి. అనేవార్ని ఎక్కడా చూళ్లేదు. కనీసం ఎవరిద్వారానైనా విననైనా విన్లేదు-

ఆ విషయాన్ని అంతటితో వదిలేశాడు సుందరం. కానీ మర్నాడు మధ్యాహ్నం మూడు గంటలకు ఆఫీసుకు ఫోన్ చేసి మరీ గుర్తు చేసిందా అమ్మాయి. "వస్తున్నారు గదా? మీ కోసం హోటల్ ఆకాష్‌లో టేబిల్ కూడా బుక్ చేశాం. మీరు రాకపోతే వేస్టయిపోతుంది." అంటూను. ఆకాష్ అంటే మాటలు కాదు. అందులో డిన్నర్ సంగతి అడగక్కర్లేదు మరి!

ఇంటికి ఫోన్‌చేసి "వెళ్దామా?" అని అడిగేడు విశాలని.

"మీ యిష్టం" అంది విశాల, ఒక వేళ వదులుకుంటే అటువంటి అవకాశం మళ్లీ రాదేమో అని అన్పించిందామెకు.

"వెళ్దాంలే" అన్నాడు సుందరం.

ఆరోజు కూడా ఓ గంట ముందొచ్చాడు సుందరం ఆఫీసునుండి. పండక్కి వాళ్ళ నాన్న కొన్న కళాంజలి కొత్త చీర కట్టుకుంది విశాల. రిబేట్‌లో కొనుకున్న పీటర్ ఇంగ్లాండ్ షర్ట్‌ని జీన్స్ ప్యాంట్‌తో టక్ చేశాడు సుందరం.

ఆరుగంటల కల్లా ఆటోలో హోటల్ ఆకాష్‌కు చేరుకున్నారు. వాళ్ళు రమ్మన్నదీ ఆ టైంకే. గేటు దగ్గరే వంగి సలాము చేసి ఆహ్వానము పలికేడు, మల్లెపూవు లాంటి డ్రస్‌లో వున్న ఒక జవాను. లోపలకు వెళ్తే కాన్ఫరెన్స్ హాల్‌కు ముందున్న లాన్‌లో ఓ పాతిక వరకూ అందమైన కేన్ కుర్చీలు వేసివున్నాయి. చుట్టూ పూలకుండీలలో పూల మొక్కలు. కుర్చీలకు కాస్త ఎడంగా చిన్న కౌంటర్ లాంటి బల్ల. అక్కడొక అందమైన అమ్మాయి. సూట్‌లో ఓ అబ్బాయి. ఆ యిద్దరూ చిరునవ్వులతో ఆహ్వానం పలికి, పేరు అడిగి తమ లిస్టులో టిక్ చేసుకుని ఎదురుగా వున్న కుర్చీలను చూపించి కూర్చోమన్నారు సుందరాన్నీ విశాలనీ. చూస్తుండగానే ఏడెనిమిది జంటలతో కొన్ని కుర్చీలు నిండేయి వాళ్ళంతా కూడా మొదటి పదిమందిలో వున్న బెస్ట్ కపుల్స్ కావొచ్చు అనుకున్నాడు సుందరం. ఇంతలో సూట్‌లో

వున్న అబ్బాయి అందరికీ కాగితాలు పంచి, వాటిల్లోని ప్రశ్నలకు సమాధానాలను పూరించమని కోరేడు. సుందర్ అందులోని ప్రతిలైనూ చదివేడు.

మీరు బెస్ట్‌కపుల్‌గా ఎన్నికైనట్టు మీకు వార్త అందించిన వ్యక్తి పేరేమిటి? గిఫ్ట్‌కూపన్ ద్వారా మీరు పొందబోతున్నదేమిటో మీకు ముందే తెల్సా? అదేమిటి? మీకు రెండు మార్లు రిమైండ్ చేసిన వారెవరు? మా కంపెనీ పేరు మీకు కొత్తగా అన్పించిందా? లేక అంతకు ముందే విన్నారా? ఇలా వున్నాయి అందులోని ప్రశ్నలు. మార్కులుండవని తెల్సినా అన్నిటినీ శ్రద్ధగా పూరించేడు సుందరం.

"మీరు మాతో ఓ రెండు గంటలు గడపగలరు గదా" అని అడిగి, మీకు మా కంపెనీ పరిచయం ఏ భాషలో చేయమంటారు? మీరు తెలుగు వారే కదా...? తెలుగు ఓ.కే.నా?" అన్నాడు సూట్ అబ్బాయి. సుందరం ఓ.కె. అన్నాక లోపల్నించి ఓ నాజుకైన అందమైన అమ్మాయిని పిలిచి 'కస్తూరి' గా పరిచయం చేశాడు. ఆమె నవ్వుతూ సుందరానికీ, విశాలకీ షేక్‌హాండ్ ఇచ్చింది. విదేశాల్లోలా ఆ పద్ధతులేమిటీ అన్ని చిన్నగా సుందరం చెవిలో గొణిగింది విశాల. ఈలోగా ఆ అమ్మాయి లోపలకి రమ్మని ఆహ్వానించి అక్కడ ఒక టేబుల్ చూపి ఒక వైపునున్న రెండు కుర్చీలూ వారికి చూపి రెండో వైపు తను కూర్చుంది. ఆ హాల్లో అటువంటి టేబుల్స్ ఓ పదే వున్నాయి. అవీ ఒక్కొక్కటే నిండుతున్నాయి.

మళ్ళీ కస్తూరి కొద్దిగా తనను తాను పరిచయం చేసుకుని నవ్వుతూనే ప్రశ్నల బాణాలన్ని సంధించింది.

"మా వాళ్ళు ఈ వార్త చెప్పగానే మీకేమనిపించింది.?"

"మా కంపెనీ గురించి మీరేమని వూహించుకున్నారు?"

"మీ ఫేమిలీ మెంబర్స్ ఎవరు? సుమారుగా సంవత్సరాదాయం ఎంత?"

"కుటుంబంతో సెలవుల్లో వూళ్ళు వెళ్తుంటారా? ఏఏ వూర్లు? ఎక్కడ బస చేస్తారు? ఎందుకు వెళ్తారు? ఒక ట్రిప్పుకి సుమారుగా ఎంత సొమ్ము ఖర్చు చేస్తారు?"

"మీ కిష్టమైన ప్రదేశాలేమిటి? కొండప్రాంతాలా? సముద్రప్రాంతమా? నదీతీరాలా? జలపాతాలున్న చోటా? ఏది?"

ఇలా చాల ప్రశ్నలు సుందరాన్నీ విశాలనీ మార్చి మార్చి అడిగింది. అన్నిటికీ సరైన సమాధానాలు రాబట్టుకున్నాక, చెప్పింది.

"మీలాంటి వారి కోసమే మా కంపెనీ చాలా ప్రదేశాలలో సమ్మర్ రిసార్ట్స్ ఏర్పాటు చేసింది. పట్టణ వాతావరణానికి దూరంగా ప్రకృతి ఒడిలో పరవశించిపోయే విధంగా చాలాచోట్ల మా రిసార్ట్‌లో ఆనందం పొందుతున్న వారున్నారు. మీరూ వీరిలో ఒకరు ఎందుక్కాకూడదూ? మా రిసార్ట్‌లో లగ్జరీ సూట్, సింగల్ మరియు డబుల్ బెడ్‌రూం పోర్షన్లు వుంటాయి. నిరంతరం త్రీ స్టార్ హోటల్ సదుపాయాలతో ఎ.సి., పిలిస్తే పలికే

సర్వెంట్స్, మీకు ప్రత్యేకంగా కావాలంటే వంటమనిషీ, సైట్ సీయింగ్‌కి వెళ్ళడానికి అద్దెకు కార్లూ, డాక్టరు సదుపాయం, యోగా, స్విమ్మింగు, గుర్రపు స్వారీ, ఈ సదుపాయీలన్నీ మీరు నమ్మలేనంత తక్కువ ఖర్చుతో పొందవచ్చు." అంటూ అక్కడతో ఆగక, బార్, లైబ్రరీ మొదలైన ఎన్నో సదుపాయాలున్నట్లు చెబుతూ, "మీక్కావల్సిన, మీకు అందుబాటులో వున్న ఏదో ఒక పోర్షన్‌ని మీరు కొనుక్కోవచ్చు. మీరక్కడ గడపని సమయాలలో అద్దెకివ్వవచ్చు. మీకు అక్కర్లేదని పిస్తే మేమేదాన్ని కొని వేరొకరికి అమ్మగలం. ఇలా చెప్పుకుపోతోంది కస్తూరి.

అప్పటికి కొంత అర్థమైంది సుందరానికి. వాళ్ళు చెప్పిన రెండు గంటలూ గడిచిపోయినా పాఠం ఆగలేదు. ఇది చాలదన్నట్టు వీడియో ద్వారా టీవీ స్క్రీన్‌పై వారి రిసార్ట్స్ నమూనాలను ప్రదర్శిస్తున్నారు.

విశాలకు కడుపులో ఆకలి మొదలైంది. దూరంగా టేబుళ్ళ మీద తెల్లని దుప్పట్లు పరచి ఆహార పదార్థాలు, ప్లేట్లూ స్పూన్‌లూ సర్దుతున్నారు. కానీ పిలుపులేదు.

"మంచి అభిరుచులు గల మీవంటి వారు మా ఈ ఫ్రీ ట్రిప్‌ని ఎంజాయ్ చేస్తారనే నమ్మకం మాకుంది. మీరు మెంబర్ కావాలి. మీ ద్వారా మీ మిత్రులూ మెంబర్లగా చేరాలి. అదే మా అభిమతం".

"మెంబరవడమంటే?" ప్రశ్నించాడు సుందరం.

"వివరాలు మా బాస్ మీకు చెబుతారు. మెంబరయిన ప్రతివారూ మా స్కీంలో ఒక రిసార్ట్స్‌లోని పోర్షన్ కొనేందుకు అర్హత సంపాదించినట్లే. ఈ రోజే మెంబరైతే మీకు కన్సెషన్ కూడా వుంటుంది."

"ఎప్పుడో ఏడాదికో మారు వెళ్ళి నాలుగు రోజులుండే భాగ్యానికి మాకివన్నీ ఎందుకు? వద్దులేండి" అంది విశాల విసిగిపోయి.

"అలా అనేస్తే ఎలా మేడమ్. మీరు మీ స్నేహితుల్నీ చుట్టాల్ని కూడ పంపవచ్చు. వారికి కూడా మీకు కల్పించే సదుపాయాలే వుంటాయి." అందామె.

"ఇంతకీ సింగిల్ రూం ఎకామడేషన్ ఎంత వుంటుందంటారు?" అడిగేడు సుందరం.

"ఈరోజైతే సుమారుగా రెండున్నర లక్షలు. మెంబర్ షిప్పు మెయింటెనెన్స్ చార్జీలూ సంవత్సరానికి అయిదువేలు. ధర ఏడాది తిరిగే సరికల్లా రెట్టింపు అవుతుంటుంది."

ఇంతలో మైక్ నుండి ఒక ఎనౌన్స్‌మెంటు విన్పించింది. "బెస్ట్‌కపుల్స్‌లో నెంబర్‌వన్ మా మెంబరై డబుల్ బెడ్‌రూం పోర్షన్ రిజర్వ్ చేయించుకున్నారు" అంటూ వారిపేర్లు చెప్పారు. వారికి అభినందన చెబుతూ ఎక్కడ్నించో చప్పట్లు విన్పించాయి.

విశాలకి పూర్తిగా అర్థమైంది. భర్త వంక చూసింది. అప్పటికే మూడు గంటల సమయం గడిచి పోయింది. డిన్నర్ ప్రసక్తే లేదు.

"మా కిప్పుడే మెంబరయ్యే ఉద్దేశం లేదు. కాస్త ఆలోచనకు టైం కావాలి. వారం రోజుల్లో చెబుతాం" అన్నాడు సుందరం.

"ఈ ఆఫర్ ఈ రోజుకే సార్. రేపైతే రేటు మారుతుంది." అందామె నవ్వుతూ.

"ఫర్వాలేదు లెండి. మాకెంత వరకూ అవసరమో చూసుకోవాలిగా" అంటూ లేచాడు.

"చివరి వరకూ వుండి డిన్నర్ చేసి గిఫ్ట్ కూపన్ తీసుకోరూ" అందామె.

"ఏదో ఒక గంట ఫంక్షనుకున్నాం. మీరు రెండు గంటలన్నారు. మూడు గంటలు దాటిపోయింది. మాకవతల పనుంది". అన్నాడు సుందరం.

"ఓకే. ఒక్కక్షణం. మా బాస్‌ని పిలుస్తా" అంటూ వెళ్ళి బాస్ లాంటి పదార్థాన్ని తీసుకొచ్చింది. ఆయన నవ్వుతూ కరచాలనం చేశాడు. ఆమె చెప్పింది విని, "ఓకే. ఒక్క క్షణం. మా బాస్‌ని పిలుస్తా" అంటూ వెళ్ళి పోయాడాయన. కస్తూరి మరో ప్రశ్నాపత్రం తీసుకొచ్చి యిచ్చింది. మా అతిధ్యం మీకెలా వుంది? మా ఆలోచన మీకు నచ్చిందా? – ఇత్యాది అక్కర్లేని ప్రశ్నలు! నిలబడే నింపేసి, సంతకం చేసి యిచ్చేశాడు సుందరం. "గిఫ్ట కూపనిస్తాం. మీరు ఆరునెలల్లోగా దాన్ని ఉపయోగించుకుని మా రిజార్ట్‌లో ఫ్రీగా వుండి మా అతిధ్యాన్ని పొందవచ్చు. మీకు నచ్చితే అక్కడే కొనుక్కోనూవచ్చు" అంటూ, "మా ఫోన్ కాల్స్‌కోసం; తదితర ఖర్చులకోసం మీరు ఓ చిన్న మొత్తాన్ని చెల్లించాల్సివుంటుంది." అంది–

"ఎంత?" అడిగేడు సుందరం.

"ఎంతోకాదు. ఐదొందలు." అందామె. పర్సు తీయబోయిన వాడల్లా ఏదో అర్థమై "సారీ" అని చటుక్కున లేచి బయటకొచ్చేశాడు. అతని వెనకే విశాల కూడ.

ఇంటికొచ్చాక అన్నం వండి అవకాయ, చింతకాయ పచ్చడి, ఇంగువచారుతో భోజనం పెట్టి "డిన్నరెలా వుంది"? అంది విశాల.

సుందరం మాట్లాడకుండా బాల్కనీలోకి నడిచేడు. తమకున్న తెలివితేటల్ని ఎదుటి మనిషిని పడగొట్టి సొమ్ము చేసుకోడానికి ఉపయోగిస్తున్న మానవజాతి వృద్ధి చెందుతోంది! నిత్యం ఎదురయ్యే వ్యాపార ప్రకటనల కతీతంగా టెలిఫోన్ డైరక్టరీలోంచి వివరాలు సేకరించి ప్రలోభపెట్టి బుట్టలో వేసుకునే ఈ రకమైన ప్రయోగాలకు మధ్యతరగతి సంసారులే బలిపశువులౌతున్నారేమో అన్పించిందతనికి.

ఈ విషయంలో ఏదో ఒకటి చెయ్యాలి! నిశ్చయించుకున్నాడు సుందరం.

◆ ❖ ◆